క్లుప్తంగా

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

నాదెండ్ల: రైతుల అభ్యున్నతికి పీఏసీఎస్ త్రీమెన్ కమిటీలు కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా నల్లమోతు హరిబాబు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మార్క్‌ఫెడ్ జోనల్ మేనేజర్ దగ్గుమల్లి హరిగోపాల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా హరిబాబు (నాదెండ్ల), డైరెక్టర్లుగా లక్ష్మారెడ్డి (జంగాలపల్లె), చెంచు ఆంజనేయులు (బుక్కాపురం) ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రైతు గోరంట్ల వేణుబాబు కుటుంబ సభ్యులకు ఇఫ్కో కంపెనీ బీమా కింద రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేతుల మీదుగా అందించారు.

నేత్ర వైద్య శిబిరం

రొంపిచర్ల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం స్కందన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన మందులు అందజేశారు. డాక్టర్ పనేందర్ రెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్‌లు అవసరమైన వారికి నరసరావుపేటలోని స్కందన్ నేత్రాలయంలో ఆపరేషన్‌లు చేస్తామన్నారు. పల్లపు శివారెడ్డి, పడాల చక్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ నూతన అధ్యక్షుడు గడుపూడి విశ్వనాథం, డైరెక్టర్లు బండారు వీరాంజినేయులు, గోనుగుంట్ల నాగరాజుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు ఆదివారం తెలిపారు. సొసైటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం ప్రారంభోత్సవం కూడా జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతువులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల దోషాలు ఉన్న వారు రాహు-కేతువులను ప్రసన్నం చేసుకుంటే దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. శ్రావణమాసం, ఆదివారం కావడంతో రాహు-కేతు పూజలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దోష నివారణకు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వర్షాల కోసం బొడ్రాయికి జలాభిషేకం



క్రోసూరు: క్రోసూరులో రైతులు, ప్రజలు వర్షాలు బాగా కురవాలని కోరుకుంటూ గ్రామ బొడ్రాయికి కృష్ణా జలాలతో అభిషేకం చేశారు. గత రెండు రోజులుగా గ్రామోత్సవాలు నిర్వహిస్తూ ఆదివారం కృష్ణా జలాలతో అభిషేకం నిర్వహించారు. ట్రాక్టర్ల ద్వారా కృష్ణా నది నుంచి నీటిని తీసుకొచ్చి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చికెన్, మటన్ షాపులు మూసివేయటం జరిగింది.

గంజాయితో ప్రాణాలకు ముప్పు

ఎస్ఐ చల్లా సురేష్



నకరికల్లు: గంజాయితో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. గంజాయి వలన కలిగే అనర్థాలను వివరిస్తూ మండలంలోని నర్సింగపాడులో ఎస్సీ కాలనీవాసులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని నిల్వ చేసినా, సేవించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి సేవిస్తే శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయన్నారు. గంజాయి లాంటి దుర్వ్యసనాలకు బానిసలై తప్పుడు ప్రవర్తనలకు లోనవుతున్నారని అన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: రక్షణ రంగంలో భారతదేశాన్ని అగ్రదేశాల సరసన నిలిపిన భరత జాతి ముద్దుబిడ్డ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాసంలో ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం స్వయంకృషితో అత్యున్నత పురస్కారాలతో పాటు పదవులు అలంకరించారని కొనియాడారు. భారతదేశపు మిసైల్‌మ్యాన్‌గా కీర్తిగడించిన ఆయనకు పద్మభూషణ్, పద్మవిభూషణ్, భారతరత్న వంటి ఎన్నో పురస్కారాలు లభించాయన్నారు. ఆయన నిజాయితీ, సరళమైన జీవనవిధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, నియోజకవర్గ క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మైలా రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ యూసుఫ్ అలి, సాపా సైదావలి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తితో రాష్ట్రపతి స్థాయికి..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాజకీయ, ఆర్థిక, అండదండలు లేకపోయినా కేవలం తన మేధాశక్తితో రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలు అందరికీ స్ఫూర్తి కావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పదవ వర్ధంతిని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న కలాం విగ్రహం వద్ద పార్టీ శ్రేణుల నడుమ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు రామేశ్వరంలోని ఒక చిన్న కుగ్రామంలో పుట్టి ఎగ్మోర్ రైల్వేస్టేషన్‌లో పేపర్‌బాయ్‌గా జీవనం గడిపి, ఉన్నత చదువులు చదివి అణు శాస్త్రవేత్తగా భారతదేశానికి సేవలందించారని అన్నారు. మిస్సైల్ రూపకర్తగా దేశానికి అణుశాస్త్ర పరిజ్ఞానాన్ని అందించి 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరుపొందారన్నారు. ఆయన నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. సీనియర్ నాయకుడు ఖాజావలి మాస్టర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర సెక్రటరీ హెల్డా ఫ్లోరెన్స్, నియోజవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు బొబ్బిలి శ్రీలక్ష్మి, నియోజకవర్గం మున్సిపల్ విభాగం అధ్యక్షుడు షేక్ రెహమాన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సిలార్ భాష, యువ నాయకులు శివరాత్రి అశోక్, తురక నాగుల్ మీరా, సయ్యద్ ఖాదర్‌బాషా, సయ్యద్ జాఫర్, మైలేరి మార్క్ పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చారు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ పీఏసీ మెంబర్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని, రాష్ట్రపతి పదవికే వన్నెతెచ్చిన మహనీయుడు కలాం అని కొనియాడారు. సాధారణ కుటుంబంలో జన్మించి పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. దేశానికి రాష్ట్రపతిగా ఎన్నో సేవలు అందించారన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు, దేశ సేవకు తన జీవితాన్ని అర్పించిన మహనీయుడు డాక్టర్ అబ్దుల్ కలాం అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కొత్తమాసు శివ, సీనియర్ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, గంధం బాలిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, కొత్త వీరాంజనేయరెడ్డి, కృష్ణారెడ్డి, జడ్పీటీసీ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో పారిశుద్ధ్యం అధ్వానం

- రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నాకు పదిమందితో కలిసి టీ తాగేందుకు అనుమతి కావాలా..?
- పోలీసు ఆంక్షలు సరికాదు
- గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలంటూ గోపిరెడ్డి ఇంటికి నోటీసు అంటించిన పోలీసులు



పట్టణంలోని ఏడవవార్డులో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు సెంటర్లలో పర్యటించారు. పారిశుద్ధ్యంపై దృష్టిసారించి ప్రజా సమస్యలను అక్కడికక్కడే అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోర్ సెంటర్‌లో ప్రజలతో కలిసి టీ తాగుతూ ప్రజా సమస్యలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో కొన్నిరోజులుగా తీయక, చెత్త పేరుకుపోయిందన్నారు. చిన్నపిల్లలకు జ్వరాలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో ఎమ్మెల్యే అరవిందబాబు అప్పుడప్పుడు వీధులలో కనపడేవాళ్ళని, ఇప్పుడెందుకు కనపడటం లేదని ప్రశ్నించారు. మంచినీళ్లు సాయంత్రం పూట రావట్లేదని, తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారని, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని కోరారు.

వైఎస్సార్ సీపీ వాళ్లకే 30 యాక్ట్?



గోపిరెడ్డి ఇంటికి పోలీసులు అంటించిన నోటీసు

తాను ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి లేదని, రద్దుచేసుకోవాలంటూ వన్‌టౌన్ పోలీసులు శనివారం రాత్రి 11:30కు నోటీసు ఇచ్చారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు పదిమందితో కలిసి టీ తాగుతూ వారితో మమేకం అయ్యేందుకు అనుమతి లేదంటే రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన ఎంత దారుణంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉందని చెబుతున్నారని, ఈ 30 యాక్ట్ ఒక వైఎస్సార్ సీపీ వారికేనా, మిగతా పార్టీలకు లేదా అని సూటిగా ప్రశ్నించారు? నాలుగురోజుల క్రితం టీడీపీ వర్గీయులు ప్రమాణ స్వీకారం చేస్తూ ర్యాలీ చేస్తే అప్పుడు వాళ్లకు 30 యాక్ట్ వర్తించదా అని అన్నారు. ప్రశాంత వాతావరణంలో అందరం కలిసి గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహించుకున్నామని, మంచినీటి సరఫరా, శానిటేషన్ మీద దృష్టిపెట్టి, ప్రజా సమస్యలపై దృష్టిసారిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, హోలీవుడ్ రఘు, గంటినపాటి గాబ్రియేలు, పాలపర్తి వెంకటేశ్వరరావు, సయ్యద్‌ఖాదర్‌బాషా, అన్నం శివాచౌదరి, నిడమానూరి సురేంద్ర, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మూరే రవీంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనతో విసిగిపోయిన జనం

'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సభల్లో వైఎస్సార్ సీపీ నాయకులు



చిరుమామిళ్లలో ఇంటింటికి తిరిగి కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నాదెండ్ల: ప్రతి ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి ప్రజల్ని వంచించడం చంద్రబాబుకే తెలిసిన విద్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. నాదెండ్ల, చిరుమామిళ్ల, జంగాలపల్లె గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ సభలు జరిగాయి. ఆయాచోట్ల గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కూటమి నేతలు ఎన్నికల హామీల్లో ఇచ్చిన కరపత్రాలను చూపుతూ క్యూఆర్ కోడ్ ద్వారా హామీలను చూపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పథకంలో కోతలు విధిస్తూ అన్నివర్గాల ప్రజలను కూటమి సర్కారు వంచించిందన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలతో పాటూ రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా నిలిచామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది గడిచినా అన్నదాత సుఖీభవపై అతీగతీ లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం అర్హులందరికీ అమలు కాలేదన్నారు. జగనంటే నమ్మకం, బాబంటే మోసం అని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుదాస్ నాయుడు, యూత్ అధ్యక్షుడు చందు, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మాజీ యార్డు చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి. మండల ఉపాధ్యక్షుడు అల్లడి రవికుమార్, బత్తుల సీతారామిరెడ్డి, జోజిబాబు, రామకష్ణ, పలు విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ మోసాలు

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వివరిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 10, 18 వార్డుల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా పదో వార్డు పరిధిలోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దరియావలి మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను, నేటి చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజలు అడగని హామీలను అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేక రెడ్ బుక్ పాలనతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలకు మేలు జరగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పదో వార్డు ఇన్‌చార్జి సయ్యద్ జమీర్, 18వ వార్డు కౌన్సిలర్ షేక్ నాయబ్ సైదాబీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్అలి, నాయకులు బండారు జయకుమార్, ఇర్రి రాఘవ, ఊసా రమేష్, పఠాన్ తలహాఖాన్, సాపా సైదావలి, కొచ్చెర్ల కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంపై అవగాహన సదస్సు



విద్యార్థులకు గణితం బోధిస్తున్న లెనిన్‌బాబు

నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని టైని టాట్స్, కిండర్ జాయ్ స్కూల్‌లో నరసరావుపేట, నకరికల్లు, రొంపిచర్ల మండలాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులకు గణిత అవగాహన సదస్సు పట్టణంలోని టైని టాట్స్, కిండర్ జాయ్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విజయవాడకు చెందిన ప్రముఖ గణిత అధ్యాపకులు డాక్టర్ ఎస్.లెనిన్ బాబు పాల్గొని గణితంపై ఆసక్తి కలిగేలా విద్యార్థులకు గణిత సమస్యలు అత్యద్భుతంగా వివరించారు. ముఖ్యంగా బీజగణితం, నెంబర్ థియరీ, త్రికోణమితి, కలనగణితంలోని అంశాలను విపులంగా వివరించారు. పోటీపరీక్షలకు గణితంలోని అంశాలు, కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సదస్సుకు జడ్పీహెచ్ఎస్ కండ్లకుంటకు చెందిన మాథ్స్ టీచర్ చాంద్‌బాషా అధ్యక్షత వహించారు. సుమారు 30 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని గణిత అభ్యాసం చేశారు. లెనిన్‌బాబును పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్ అభినందించారు. భాగేశ్వరి, షేక్ చాంద్‌బాబు, మద్దుకూరి మోహన్ సమన్వయం చేశారు. విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, కోశాధికారి కోయ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో ఉచిత వైద్య శిబిరం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామం రామాపురం కాలనీలో నరసరావుపేటకు చెందిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బి.వెంకట్రావు, సీహెచ్ కృష్ణచైతన్యలు పాల్గొని వైద్య సేవలు అందించారు. మొత్తం 185 మందికి బీపీ, షుగర్, మూత్ర, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పని చేసే నాయకులను ఎన్నుకోవాలి

సత్తెనపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల్లో నిస్వార్థంగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం సత్తెనపల్లి వచ్చిన ఆయనను లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అద్దంకి బాబు మాదిగ మాట్లాడుతూ గ్రామగ్రామాన జెండా దిమ్మెలను నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనతోపాటు కొడవటి అశోక్ మాదిగ, ఉపాధ్యక్షుడు కందుకూరు రమేష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి సత్య మాదిగలను లక్కరాజుగార్లపాడు ఎమ్మార్పీఎస్ నాయకులు జంగాల శ్రీనివాసరావు, ఎంఈఎఫ్ సీనియర్ చిలకా జాన్సన్ మాదిగలు కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయ కులు ఉన్నారు.

ఆటో దహనంపై కేసు నమోదు



సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల గ్రామంలో ఆటో దహనంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన మొక్కపాటి భూపతి తన అత్త అయిన అంజలి మోర్జంపాడు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. భర్త ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఆమెకు బెల్లంకొండ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బాణావత్ ఆంజనేయులునాయక్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఆమె ఆంజనేయులునాయక్‌కు రూ.1.50 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల ఆమెకు గ్యాస్ ప్రమాదంలో కాళ్లు కాలిపోవడంతో చికిత్స నిమిత్తం ఆమె ఇవ్వాల్సిన నగదు ఇవ్వమని కోరుతుండటంతో ఇదిగో అదిగో అంటూ ఆంజనేయులునాయక్ వాయిదా వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 25న ఆటో పంపించి డబ్బు ఇచ్చి తీసుకువెళ్లమని చెప్పగా ఆంజనేయులునాయక్ అందుకు అంగీకరించి డ్రైవర్ ద్వారా టాటా మ్యాజిక్ ఆటోను పంపించాడు. వారు ఆటోను రెంటపాళ్లకు తీసుకువచ్చారు. ఆంజనేయులు నాయక్ శనివారం వచ్చి ఆటో ఎక్కడుందో చెప్పాలని, నగదు ఇచ్చి తీసుకువెళ్తానని చెప్పాడు. దీంతో ఆటోను చూసి వెళ్లిన ఆంజనేయులునాయక్ డబ్బు ఇవ్వకపోగా శనివారం అర్ధరాత్రి దహనం చేశాడని భూపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.రాధాకృష్ణ



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

యడ్లపాడు: ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయటం ప్రజలను మోసగించడమేనని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.రాధాకృష్ణ పేర్కొన్నారు. యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీఛార్జ్ మాదిరిగా బిల్లును పే చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారని ఈ మీటర్ల వల్ల ఒక్కో వినియోగదారుడుపై రూ 10వేల నుంచి రూ. 17వేల వరకు అదనపు భారం పడుతుందన్నారు. వీటిని 93 నెలల కాలంలో వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వసూలు చేయడం జరుగుతుందన్నారు. రీఛార్జ్ తరహాలో విద్యుత్ మీటర్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉప కేంద్రాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు ఆలోకం సుబ్బారావు, గోగడ హరిబాబు, నంబూరు తులసయ్య, కల్లూరి రమ్య, సీహెచ్ గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

● విస్తారంగా వర్షాలు.. చిగురిస్తున్న ఆశలు



మల్లాది వద్ద వర్షాలకు తెప్పరిల్లిన పత్తి పైరు

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల్లో నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులలో పత్తి పంటపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ వర్షాల వల్ల వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎరువులు వేసి పత్తి పంటలో అంతరకృషి చేస్తుండటంతో పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరుగుతుండటంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఆగస్ట్ 13 నుంచి త్రిశక్తి దుర్గాపీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య స్కూల్ దగ్గర వేంచేసియున్న త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్ట్ 13 నుంచి ప్రారంభమవుతాయని పీఠాధిపతులు వెలిదండ్ల హనుమత్‌స్వామి ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్లకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, దశవిధ అభిషేకాలు జరుగుతాయన్నారు. పురోహితుడు కలవకొలను సీతారామ శాస్త్రి (రాము) ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.